

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.157	228	259
సూర్యాపేట	రూ.160	230	260
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 । కనిష్ఠం 23.8

అడుగంటిన ఆశలు



సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దోరకుంటలో ఎండిపోయిన వరిపొలాన్ని మేస్తున్న పశువులు

- ప్రాజెక్టుల్లో నీరు అంతంతమాత్రమే
- ఒట్టిపోయిన చెరువులు, కుంటలు
- అడుగంటిన భూగర్భ జలాలు
- ఆసరా ఇవ్వని బోర్లు
- యాసంగి వరిపై ఆశలు వదులుకున్న రైతులు

వానాకాలంలో వరుణుడు కరుణ చూపకపోవడంతో ప్రాజెక్టుల్లోకి వరద చేరలేదు. ఫలితంగా ప్రాజెక్టులు డెడ్‌స్టోరేజీకి చేరువలో ఉండగా, నీటి నిల్వలు కేవలం తాగునీటి అవసరాలకే ఉన్నాయి. యాసంగిలో బోరుబావుల ఆధారంగా వరి సాగుచేసిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రాజెక్టుల నుంచి కాల్వలకు నీటి విడుదల లేకపోవడంతో ఆయకట్టులోని చెరువులు, కుంటలు ఒట్టిపోయాయి. భూగర్భ జలమట్టం పడిపోవడంతో బోర్లు ఆగి ఆగి పోస్తున్నాయి. ఈ నీరు ఏమాత్రం సరిపోక యాసంగి వరి చేలు నెర్రెలుబారుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు యాసంగి వరిపై ఆశలు వదులుకుంటున్నారు. కళ్ల ఎదుటే ఎండుతున్న పంటను చూసి కన్నీళ్లను దిగమింగి వరి చేలల్లో పశువులను మేపుతున్నారు. కృష్ణానదిలో నీరు తగ్గడంతో త్రిపురారం మండలం కేంద్రంలోని ఓ రైతు పొలంలోకి మొసలి వచ్చింది.

● పొలాల్లోకి మొసలి

కృష్ణానదిలో నీరు తగ్గడమే కారణం



త్రిపురారం మండల కేంద్రంలో ఓ రైతు పొలంలో కనిపించిన మొసలి

● వివరాలు 7లో..

ఉమ్మడి జిల్లాలో 1,268 పోస్టులు

- ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ
- మెగా డీఎస్సీతో నిరుద్యోగుల్లో చిగురించిన ఆశలు



నల్లగొండ, ఫిబ్రవరి 29: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గురువారం డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,268 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనుంది. జిల్లాల వారీగా అందుబాటులో ఉన్న ఖాళీలను పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. నల్లగొండ జిల్లాలో మొత్తం 605 పోస్టులు, సూర్యాపేట జిల్లాలో 386, యాదాద్రి జిల్లాలో 277 పోస్టులు భర్తీ కానున్నాయి. జిల్లా స్థాయి ఎంపిక కమిటీల ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ పాఠశాల్లో ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తారు. డీఎస్సీ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం పేర్కొంది. కొత్తగా దరఖాస్తు చేసే అభ్యర్థులు రూ.1000 ఫీజు చెల్లించాలి. ఒకటి కంటే ఎక్కువ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ప్రతీ పోస్టుకు వేరుగా దరఖాస్తు చేయాలి. పరీక్ష కేంద్రాల కేటాయింపు ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి ముందు ప్రాతిపదికన చేసే అవకాశాలు ఉన్నాయి.


ఈసారి ప్రత్యేకంగా స్పెషల్ టీచర్స్

రాష్ట్ర ప్రభుత్వం ఈసారి మెగా డీఎస్సీలో స్పెషల్ టీచర్స్ పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకుంది. అదనంగా 141 పోస్టులు ఈ కేటగిరీలో చూపింది. దీంట్లో కొన్ని పోస్టులు మానెటరింగ్ చేయడానికి కేటాయించగా, అంధులు, చెవిటి, మూగ అభ్యర్థులతో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. గత ఏడాది డీఎస్సీ నోటిఫికేషన్ కంటే ఈసారి మెగా డీఎస్సీలో ఉమ్మడి జిల్లాలో పోస్టుల సంఖ్య భారీగా పెరిగింది. గత సంవత్సరం సెప్టెంబరు 6వ తేదీన జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో తక్కువ పోస్టులు ఉన్నాయి. ఆ నోటిఫికేషన్ రద్దు చేసి తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్‌తో పోస్టులు పెరగడంతో నిరుద్యోగులు ఉత్సాహంగా ఉన్నారు. గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌లో నల్లగొండ జిల్లాలో 219 పోస్టులు చూపగా, ఈసారి మొత్తం 605 ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో గతంలో 185 పోస్టులు ఉండగా, ఈసారి 386 ఖాళీగా చూపించారు. యాదాద్రి జిల్లాలో గతంలో 99 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉండగా, ఈసారి 277 చూపించారు. గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో 503 పోస్టులు ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో 1268 పోస్టులను భర్తీ చేయనుంది.

ఉమ్మడి జిల్లాలో పోస్టులు ఇలా..

జిల్లా	ఎస్ఏ	ఎస్‌జీటీ	ఎల్‌పీటీ	పీఈటీ	స్పెషల్ టీచర్స్	మొత్తం
నల్లగొండ	128	383	28	06	60	605
సూర్యాపేట	86	224	23	05	48	386
యాదాద్రి	84	137	21	02	33	277

ఫైల్ పెండింగ్‌లోనే



- అధికారుల్లో వణుకు
- గొర్రెల యూనిట్ల ఫైల్‌పై అనుమానాలు
- పరిశీలించాకే తుది నిర్ణయమని పక్కన పెట్టిన కలెక్టర్
- తప్పులు కప్పిపుచ్చుకునే యత్నంలో పశుసంవర్ధకశాఖ

నల్లగొండ, ఫిబ్రవరి 29: గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో గొర్రెల యూనిట్ల కొనుగోళ్లలో అక్రమాలు పెద్దఎత్తున జరిగాయన్న అనుమానాలు బలపడుతున్నాయి. నల్లగొండ జిల్లాలో సుమారు 1,066 యూనిట్ల కొనుగోలు విషయంలో ఇప్పటికే పలు ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించిన ఫైల్‌పై నల్లగొండ జిల్లా గత కలెక్టర్ కర్ణన్‌కు అనుమానాలు రావడంతో పక్కన పెట్టారు. ఇంతలో ఆయన బదిలీ అయ్యారు. ప్రస్తుత కలెక్టర్ హరిచందన సైతం ఈ ఫైల్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటామని పెండింగ్‌లో ఉంచారు. పలుమార్లు పశుసంవర్ధకశాఖ అధికారులు ఈ ఫైల్ క్లియరెన్స్ కోసం వెళ్లినా చుక్కెదురైంది. గొర్రెల పంపిణీ పథకం నిధులను పక్కదారి పట్టించిన కేసులో ఇటీవల కామారెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన నలుగురు అధికారులను అరెస్ట్ చేసిన ఏసీబీ, వారిని గురువారం నుంచి కస్టడీలోకి తీసుకొని విచారిస్తోంది. దీంతో నల్లగొండ జిల్లాలో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉండటంతో అధికారుల్లో ఆందోళన మొదలైంది.

తప్పులను కప్పిపుచ్చుకునేందుకు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రస్థాయిలో పనిచేసిన అధికారులతో పాటు కీలక ప్రజాప్రతినిధులు సైతం ఈ అవినీతి ఉచ్చులో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. నిబంధనల మేరకు ఒక్కో రైతు నుంచి 10నుంచి 12 యూనిట్లు మాత్రమే కొనుగోలు చేయాలి. దీనికి విరుద్ధంగా జిల్లాలోని కొందరు అధికారులు 1,066యూనిట్లలో ఏకంగా 832 యూనిట్లను దళారుల నుంచి కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇది నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ జిల్లా అధికారులతో పాటు రాష్ట్రస్థాయి అధికారులు అలాంటి నిబంధన లేదనే వాదాన్ని తెరపైకి తీసుకువస్తున్నారు. అయితే ఒక్క రైతు వద్ద ఇన్ని యూనిట్లు ఎలా ఉంటాయనేదానికి అధికారులు సమాధానం ఇవ్వడం లేదు.

పశుసంవర్ధక శాఖలో సిబ్బంది కొరతతో అప్పటి ప్రభుత్వం ఇతర శాఖల నుంచి కూడా అధికారులను కేటాయించింది. కొందరు అధికారులు ఎంతో ఆసక్తితో ఈ డ్యూటీ వేయించుకున్నట్లు సమాచారం. ఏపీలోని ఇతర జిల్లాల్లో గొర్రెల కొనుగోళ్ల కోసం మూడు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు కూడా వెళ్లారు. ఓ అధికారి అయితే రాత్రింబవళ్లు గొర్రెల కొనుగోళ్లలోనే ఉన్నట్లు తెలిసింది. సదరు అధికారి కొనుగోలు చేసిన గొర్రెల యూనిట్లు లబ్ధిదారులకు చేరాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర స్థాయిలో అప్పటి అధికారులకు సత్సంబంధాలు ఉన్న జిల్లాకు చెందిన ఇతర శాఖల అధికారులు గొర్రెల కొనుగోళ్ల కోసం ఏపీలోని ప్రకాశం జిల్లాకు వెళ్లారు. జీవో 52 ప్రకారం ఒక్కో రైతు నుంచి 10నుంచి 12యూనిట్లు కొనుగోలు చేయాలి. కానీ కర్నూలు జిల్లాలో కూడా దళారుల నుంచి గొర్రెల యూనిట్లను సేకరించారు.

ఏసీబీ దృష్టి సారించే అవకాశాలు

హైదరాబాద్‌లో ఏసీబీ అధికారులు ఇప్పటికే వివిధ శాఖలకు చెందిన అధికారులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తుండటంతో వారిచ్చే సమాచారం ఆధారంగా జిల్లాలో గొర్రెల యూనిట్ల కొనుగోలుకు సంబంధించిన ఫైళ్లను స్వాధీనం చేసుకునే అవకాశాలు ఉన్నాయని సంబంధిత శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు. కాగ్ నివేదిక సైతం నల్లగొండ జిల్లాలో గొర్రెల కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని తేటతెల్లం చేసింది. దీంతో ఏ క్షణమైన రికార్డులను స్వాధీనం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. గొర్రెల పంపిణీ పథకం నేపథ్యంలో నల్లగొండ జిల్లాలో 126 గొర్రెలను ఒక ఆటోలో తరలించినట్లు అధికారులు రికార్డులో చూపించారు. ఇన్‌వాయిస్‌లో పేర్కొన్న వాహనాల నెంబర్లు కూడా తప్పులే. నకిలీ ఇన్‌వాయిస్‌లకు బిల్లులు చెల్లించారని ఇప్పటికే కాగ్ గుర్తించింది. ఒక్క నల్లగొండ జిల్లాలోనే 1172 ఉదంతాల్లో నకిలీ ఇన్‌వాయిస్‌లకు చెల్లింపులు చేసినట్లు కాగ్ నివేదికలో పేర్కొంది.

కలెక్టర్ ఇంకా ఫైల్‌ను పరిశీలించలేదు

నల్లగొండ జిల్లాలో గతంలో కొనుగోలుచేసిన గొర్రెల యూనిట్ల ఫైల్ కలెక్టర్ వద్ద ఇంకా పరిశీలనలో ఉంది. పూర్తిగా ఫైల్‌ను పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కొనుగోళ్లకు, బిల్లులకు సంబంధించి ఏం పొరపాట్లు జరిగాయో నా వద్ద సమాచారం లేదు. నేను ఇక్కడ బాధ్యతలు చేపట్టక ముందే గొర్రెల కొనుగోళ్లకు సంబంధించిన ఫైల్ అప్పటి కలెక్టర్ కర్ణన్ ఉన్న సమయంలో కలెక్టరేట్‌కు పంపారు. అప్పటి నుంచి ఆ ఫైల్ కలెక్టరేట్‌లోనే పెండింగ్‌లోనే ఉంది. ప్రస్తుత కలెక్టర్ సైతం ఫైల్‌ను పూర్తిస్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు.

ఎంవీ.సుబ్బారావు, పశుసంవర్ధకశాఖ జేడీ

హాలియా మునిసిపల్‌లో నెగ్గిన అవిశ్వాసం

● 12 మందిలో 10 మంది కౌన్సిలర్ల మద్దతు
● కాంగ్రెస్ ఖాతాలోకి మునిసిపాలిటీ

హాలియా, ఫిబ్రవరి 29: హాలియా మునిసిపాలిటీ బీఆర్ఎస్ ఛైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ, వైస్ ఛైర్మన్ నల్లగొండ సుధాకర్‌లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మునిసిపాలిటీ అభివృద్ధి కుంటుపడిందని, ఛైర్‌పర్సన్ పట్టించుకోవడం లేదని ఫిబ్రవరి 10వ తేదీన ఎనిమిది మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మిర్యాలగూడ ఆర్డీవో చెన్నయ్య అవిశ్వాస సమావేశం నిర్వహించారు. మొత్తం 12మంది సభ్యులకు 10 మంది హాజరై అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో చెన్నయ్య ప్రకటించారు. ఎక్స్ ఆఫీషియో సభ్యుడు, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి సమావేశానికి హాజరైనా, సరిపోడా సభ్యులు ఉండడంతో ఆయన ఓటింగ్‌లో పాల్గొనలేదు. అవిశ్వాసం నెగ్గిన విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని, త్వరలోనే నూతన ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌ల ఎంపిక నిర్వహించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు చింతల చంద్రారెడ్డి, దీప్తి, యడవల్లి అనుపమ, గౌని సుధారాణి, చంద్రకళ, ఎల్లమ్మ, అన్నెపాక శ్రీనివాస్, ప్రసాద్‌నాయక్, వర్ర వెంకటరెడ్డి, నల్లమోతు వెంకటయ్య, నాయకులు యడవల్లి నరేందర్‌రెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, కుందూరు వెంకటరెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మునిసిపల్ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

బలాబలాలు ఇలా..

2020లో మొత్తం 12వార్డులకు కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 5, స్వతంత్రులు ఒక స్థానం గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థి బీఆర్ఎస్‌లో చేరగా, నాటి ఎమ్మెల్యే, నోముల నర్సింహయ్య ఎక్స్ ఆఫీషియో మెంబర్‌గా ఓటు వేయడంతో హాలియా మునిసిపల్ పీఠం బీఆర్ఎస్‌కు దక్కింది. ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఎనిమిది, బీఆర్ఎస్‌కు నాలుగు స్థానాలున్నాయి.

కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరిస్తున్నారు: ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరిస్తున్నారని, ఇప్పటికే నియోజకవర్గంలోని రెండు మునిసిపాలిటీలను కైవసం చేసుకున్నామని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియాలో గురువారం ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో జరిగే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల ఆదరణతో విజయం సాధిస్తామన్నారు.

ఇంటర్ పరీక్షలకు 439మంది గైర్హాజరు

నల్లగొండ, ఫిబ్రవరి 29: జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలకు 439 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 14,090మంది విద్యార్థులకు 13,651మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. జనరల్ విభాగంలో 12,106మందికి 11,785మంది పరీక్షలు రాయగా 321మంది పరీక్షలకు హాజరు కాలేదు. ఒకేషనల్ విభాగంలో 1,984మందికి 1,866మంది హాజరుకాగా 118మంది పరీక్షలకు హాజరుకాలేదు. జిల్లాలో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

ఆర్య సమాజం.. శతవసంతం

● నల్లగొండలో ఆర్యసమాజం స్థాపించి వందేళ్లు
● నేటి నుంచి జాతీయ మహాసభలు ● రాందేవ్ బాబా రాక రేపు



జిల్లా కేంద్రంలో ముస్తాబైన ఆర్యసమాజ మందిరం

● 7లో..

పుట్టంగండి పంప్‌హౌస్‌కు గ్రౌటింగ్ పనులు

● ప్రభుత్వం ముందస్తు చర్యలు

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 29: ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ)లో కీలక భాగమైన పుట్టగండి పంప్‌హౌస్‌కు కొద్ది రోజులుగా గ్రౌటింగ్ పనులు కొనసాగుతున్నాయి. పుట్టగండి పంపహౌస్ నిర్మించి 20 ఏళ్లు పూర్తి కావడంతో కాలమ్స్ మధ్య నుంచి నీరు లీకవుతోంది. దీంతో దానికి అనుకుని ఉన్న ఇనుప పిల్లర్లు తుప్పు పడుతుండడంతో భవిష్యత్‌లో పంప్‌హౌస్‌కు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున కాంగ్రెస్ ప్రభుత్వం, ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా కాలమ్స్ పటిష్టంగా ఉండడం కోసం కెమికల్స్ కలిపి చిన్న చిన్న రంధ్రాలు పూడ్చేలా గ్రౌటింగ్ చేస్తున్నారు. పనులు కూడా వేగవంతంగా కొనసాగుతున్నాయి. దీంతో పంప్‌హౌస్‌కు భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదం ఉండదని నీటిపారుదలశాఖ డీఈ నాగయ్య తెలిపారు.



పుట్టంగండి పంప్‌హౌస్‌లో గ్రౌటింగ్ పనులు నిర్వహిస్తున్న కార్మికుడు

నెల రోజులు 30, 30(ఏ) పోలీసు యాక్ట్ అమలు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 29 : శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని మార్చి1వ తేదీ నుంచి 30తేదీ వరకు నెల రోజుల పాటు నల్లగొండ జిల్లావ్యాప్తంగా 30, 30(ఏ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించ కూడదని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజాధనానికి నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసు అధికారులకు సహకరించాలని కోరారు. ఎలాంటి అనుమతి లేకుండా సభలు సమావేశాలు, నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలికతో అసభ్యకర ప్రవర్తన

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 29 : బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై నల్లగొండ జిల్లాలో పోక్సో కేసు నమోదైంది. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండకు చెందిన అవివాహితుడైన రాపోలు నరేష్ పట్టణంలోని ఓ చికెన్‌సెంటర్‌లో పనిచేస్తూ వచ్చిన డబ్బుతో మద్యం తాగి తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పట్టణంలోని ఓ కాలనీకి చెందిన తొమ్మిదేళ్ల బాలిక స్కూల్‌కు వెళ్లి వచ్చి తమ తాత ఇంట్లో ఒంటరిగా ఆడుకుంటోంది. గమనించిన నరేష్ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో సదరు బాలిక ఏడ్చుకుంటూ వెళ్లి తల్లికి చెప్పడంతో ఆమె వచ్చేసరికి నరేష్ అక్కడి నుంచి పరారయ్యాడు. వెంటనే బాధితురాలి తల్లి స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, నరేష్‌పై పోక్సో కేసును నమోదుచేశారు. నిందితుడు నరేష్ పరారీలో ఉన్నాడని, అతడి ఆచూకీ కోసం వెతుకుతున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

మేడారం జాతరలో ఒకరి అదృశ్యం

తాడ్వాయి, ఫిబ్రవరి 29 : మేడారం జాతరలో సూర్యాపేట జిల్లా వాసి అదృశ్యమయ్యాడు. ఇందుకు సంబంధించి గురువారం అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామానికి చెందిన ముత్యం కొమురయ్య(45) కుటుంబం మేడారం జాతరకు వచ్చింది. ఊరట్టం క్రాస్‌లోని స్థూపం పరిసరాల్లో బసచేసింది. బుధవారం అర్ధరాత్రి మూత్ర విసర్జన కోసం బయటకు వెళ్లిన కొమురయ్య తిరిగి రాలేదని ఆయన భార్య సుజాత కన్నీటి పర్యంతమైంది. ఆచూకీ తెలిసిన వారు 6303454968, 6303068621, 8106737107 నంబర్లకు సమాచారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేసింది.

వలిగొండ మండలంలో వివాహిత..

వలిగొండ, ఫిబ్రవరి 29:యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గోకారం గ్రామానికి చెందిన వివాహిత నారి మనీష అదృశ్యమైంది. ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపిన వివరాల ప్రకారం భర్తతో ఆరు నెలల క్రితం భర్తతో విడాకులు తీసుకొని పుట్టింట్లోనే ఉంటోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి కనబడకుండా పోయింది. చుట్టు పక్కలా, బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం కనబడలేదు. తండ్రి నారి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదగిరీశుడి సన్నిధిలో నిత్యకైంకర్యాలు

- స్వామి సేవలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి
- నిత్య ఆదాయం రూ.18.53లక్షలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 29: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గురువారం నిత్యకైంకర్యాలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపిన ఆచార్యులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టా అలంకారమూర్తులను వేదమంత్రోచ్చరణలతో పంచామృతాభిషేకం జరిపి తులసీ దళాలతో అర్చించారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హోమం జరిపారు. అనంతరం గజవాహన సేవోత్సవం నిర్వహించి విశ్వక్సేనుడికి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణం నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం, అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు కొనసాగాయి. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరస్వామికి, మహామండపంలో స్ఫటిక మూర్తులకు నిత్యవిధి కైంకర్యాలు, నిత్య రుద్రహవన పూజలు స్మార్త సంప్రదాయరీతిలో కొనసాగాయి. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.18,53,945 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామిని సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. స్వయంభువులను ఆయన దర్శించుకోగా, ఈవో రామకృష్ణారావు స్వామివారి అభిషేకం లడ్డూ ప్రసాదాలు అందజేశారు.





నిత్యతిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, వేం నరేందర్‌రెడ్డికి స్వామివారి ప్రసాదాలు అందజేస్తున్న ఈవో రామకృష్ణారావు

అడుగంటిన ఆశలు

నీళ్లు లేక..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆయకట్టు నానాటికీ తీసికట్టు

నాడు.. ఒకప్పుడు పాడి పంటలతో అలరారిన ప్రాంతాలు.. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసి అన్నపూర్ణగా పేరుతెచ్చిన పచ్చని పంట భూములు.. నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ ఆయకట్టు కింద లక్షల ఎకరాలు సాగయ్యేవి.. ధాన్యంతో పాటు అన్నదాతకు ఉపాధిని, భవిష్యత్‌కు భరోసానిచ్చే బంగారు భూములు..

నేడు నీళ్లు లేక నెర్రెలు బారాయి.. బంగారు పంటలు పండించే భూముల్లో నీరందక ఎండిపోతున్న పంటలే దర్శనమిస్తున్నాయి.. బోర్ల మీద ఆశపెట్టుకున్న రైతు ఆ బోర్లెండి ప్రతి రోజూ కన్నీటి సాగు చేస్తున్నాడు.. ఒకప్పటి ఆయకట్టు ఇప్పుడు పచ్చని పంటల స్థానంలో ఎండిపోయి, జీవులకు మేతగా మారుతున్నాయి.. అన్నదాత గుండెల్లో ఆందోళన సాగు కొనసాగుతూనే ఉంది..

కోదాడ రూరల్: కోదాడ మండలంలో నీళ్లు లేక నాగార్జునసాగర్ ఆయకట్టులో వరి చేలు ఎండిపోతున్నాయి. పంటలకు పెట్టిన వేల రూపాయల పెట్టుబడులు కళ్లముందే ఆవిరవుతుంటే రైతు కన్నీటి పర్యంతం అవుతున్నాడు. బావులు, బోర్లు, చెరువుల్లో కూడా నీరు ఇంకి పంట చేతికొచ్చే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఎడమకాల్వ కింద సుమారు 10 వేల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. పంట పొట్టదశకు వచ్చే సరికి భూగర్భజలాలు క్రమేణా తగ్గిపోయాయి. మండలంలోని నల్లబండగూడెం, రెడ్లకుంట, దోరకుంట, కాపుగల్లు, గణపవరం, రామలక్ష్మీపురం, కూచిపూడి, తొగర్రాయి, గుడిబండ గ్రామాల్లో రైతులు బోర్లు, బావుల కింద కొద్దోగొప్పో వరి సాగు చేశారు. కాల్వకు నీరు విడుదల చేయలేకపోతారా, పంట చేతికి రాకుండా పోతుందా అన్న ఆశతో సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నీళ్ల నుంచి పొలాల్లోకి.. దారిమళ్లిన మొసలి..


సాగర్‌లోకి మొసలిని వదిలిన అధికారులు

త్రిపురారం : నల్లగొండ జిల్లా త్రిపురారంలో పొలాల్లోకి వచ్చిన మొసలిని సాగర్ రిజర్వాయర్‌లో వదిలిపెట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. త్రిపురారం మండలకేంద్రంలోని రైతు కోడి నాగయ్య గురువారం పొలానికి ఉదయం ఆరు గంటలకు వెళ్లాడు. పంట చేను పడిపోయి చూసి వెతకగా అక్కడ మొసలి కనిపించింది. ఇదే విషయాన్ని గ్రామస్తులతో పాటు పోలీసు, అటవీ శాఖ అధికారులకు తెలిపాడు. అటవీ శాఖ రెస్క్యూ టీం సహాయంతో మొసలిని తాళ్లతో బంధించి ట్రాలీ వాహనంలో నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు తరలించారు. పొలంలో గుర్తించిన మగ మొసలి వయస్సు ఐదేళ్లు ఉంటుందని, రెండు క్వింటాళ్ల బరువు ఉంటుందని మిర్యాలగూడ అటవీ రేంజ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. నాగార్జునసాగర్ కాల్వల ప్రవాహంలో మొసలి చిన్నపిల్లగా ఉన్నపుడే త్రిపురారం నల్లచెరువుకు చేరుకుందని భావిస్తున్నారు. ఈ ఏడాది తీవ్ర కరువు పరిస్థితులతో చెరువు దాని కింద ఉన్న బావులు పూర్తిగా ఎండిపోయాయి. ఎండిన చెరువు నుంచి సమీపంలోని పొలాల్లోకి మొసలి వెళ్లింది. పట్టుకుని సాగర్‌లో వదిలివేయడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.


మిర్యాలగూడ మండలంలో ఎండుతున్న పంటలో మేస్తున్న పశువులు

మిర్యాలగూడ రూరల్: నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో ఎడమకాల్వ కింద సాగు నీరందక బోర్లుబావుల ఆధారంగా రైతులు వరి పంట సాగు చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో సాగు విస్తీర్ణం 41955 ఎకరాలు కాగా సాగర్ ఎడమకాల్వ ఆధారంగా మేజర్లు, చెరువులను నింపుకుని, కుంటల ఆధారంతో అధికంగా వరిసాగు చేపడుతారు. ప్రస్తుతం కేవలం బోరుబావుల ఆధారంగా 26,930 ఎకరాల్లో పంట సాగు చేపట్టారు. వరి 26,776 ఎకరాలు, మినుము 68 ఎకరాలు, అలసంద 12 ఎకరాలు, పెసర్లు 37 ఎకరాలు, ఉలవలు 11 ఎకరాలు, జొన్న 6, మొక్కజొన్న 2, వేరుశనగ ఎకరం, కూరగాయలు 18 ఎకరాల్లో పంట సాగు చేపట్టారు. రైతులు సాగునీరు అందే పరిస్థితులు లేవని సొంత ఖర్చులతో బోర్లు వేసుకుకన్నారు. వాతావరణ పరిస్థితులతో పాటు కుంటలు, చెరువుల్లో నీరు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. మిర్యాలగూడ మండలంలోని ముల్కలకాల్వ, రాయినిపాలెం, ఆలగడప, జాలుబాయితండా, ఐలాపురం, కాల్వపల్లి తదితర గ్రామాల్లో బోరుబావుల నుంచి వచ్చే నీటితో వరిసాగు చేపట్టారు. నీటితడి సరిపోక వందల ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది.

పశుగ్రాసంగా పంట

వరి పంట చేతికి అందేది కష్టమనే తరుణంలో పంటను మధ్యలోనే పశుగ్రాసంగా మార్చుకోవాల్సి వచ్చిందని రైతులు అంటున్నారు. ఎకరాకు రూ.25వేల పెట్టుబడి పెట్టి పూర్తిస్థాయిలో నష్టపోవడం బాధాకరమని, ప్రభుత్వం ఎండిన పంటను గుర్తించేలా చర్యలు తీసుకొని నష్టపరిహారం అందేలా కృషి చేయాలని పలువురు రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

8 ఎకరాల్లో సాగు చేశా



ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేశా. చివరి దశలో ఒక్క తడికి నీరు అందకపోవడంతో పంట పూర్తి స్థాయిలో ఎండిపోయింది. బోర్లు వేసినా ఫలితం లేకుండా పోయింది.

● లక్ష్మీనర్సయ్య(రైతు, ముల్కలకాల్వ)

దేవరకొండ డివిజన్‌లో తగ్గిన వర్షపాతం


చందంపేట, నేరేడుగొమ్ము మండలాలకు నీరు సరఫరా అయ్యే కాల్వ

దేవరకొండ : నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లో వేసవి ప్రారంభంలోనే కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవక బోరు, బావుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. అరకొరగా సాగు చేసిన వేరుశనగ పంట ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లోనూ నీటిమట్టం గణనీయంగా తగ్గుతోంది. ఏఎమ్మార్పీ ప్రాజెక్టు తాగునీటికే పరిమితమైంది. దేవరకొండ డివిజన్‌లో గతేడాది జనవరిలో 0.1 మిల్లీమీటర్ల వర్షం పడగా 19.1 మిల్లీమీటర్లు సాధారణ వర్షాపాతం నమోదైంది. ఈ ఏడాది జనవరిలో దేవరకొండ డివిజన్‌లో 0.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సాధారణ వర్షపాతం 19.1 మిల్లీమీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది డివిజన్ పరిధిలోని చందంపేట, నేరేడుగొమ్ము, దేవరకొండ, చింతపల్లి, డిండి మండలాలలో 60 వేల ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. డిండి ప్రాజెక్టు నీటి మట్టం 36 అడుగులు కాగా ప్రస్తుతం 33 అడుగులమేర నీరు నిల్వఉంది. ప్రతి ఏడాది డిండి ప్రాజెక్టు నీటిని వేసవిలో కాల్వల ద్వారా చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని చెరువులు, కుంటలకు విడుదల చేసి తాగునీటి సమస్య తలెత్తకుండా చూసేవారు. ఈ ఏడాది కూడా డిండి ప్రాజెక్టులో నీరు ఉన్నందున చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని 26 చెరువులను నింపి పశువులతో పాటు తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బోరు, బావుల్లో నీళ్లు తగ్గుతున్నాయి

వర్షాలు లేక బోరు, బావుల వద్ద భూగర్భజలమట్టం తగ్గుముఖం పట్టింది. రెండు ఎకరాల్లో వేరుశనగ పంట వేస్తే నీరులేక ఎకరం వరకు ఎండు దశకు చేరుకుంది. డిండి ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసి సమస్యను పరిష్కరించాలి.

● జబ్బు సత్తయ్య, రైతు, చందంపేట

బోరుమోటార్లతో భగీరథ ప్రయత్నాలు


నీళ్లు పడని బోరును చూపిస్తున్న రైతు విములయ్య

ఈయన పేరు అల్లె విములయ్య, యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం చిన్నపడిశాల గ్రామం. ఆయనకున్న రెండు ఎకరాల్లో వరి సాగు చేశాడు. రెండో బోర్లు, ఒక బావి ఉన్నా తక్కువగా నీరు పోస్తుండటంతో పంటను కాపాడుకునేందుకు మరో రెండు బోర్లు వేశాడు. నీరు రాకపోగా, సుమారు రూ.లక్ష వరకు ఖర్చు వచ్చింది. పంట పొట్ట దశలో ఉన్న ఎకరం పంట ఎండిపోతోంది. ఈ దఫా వరి సాగు చేస్తే నష్టమే మిగిలిందని రైతు వాపోయాడు.

● అడ్డగూడూరు

ఎస్సారెస్పీ పరిధిలో తెగులు.. దిగులు

పెన్‌పహాడ్ : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో భూగర్భ జలాలు అడుగంటి వరి పంటలు ఎండిపోతున్నాయి. అదేవిధంగా చీడపీడలతో పంటలు దెబ్బతింటున్నాయి. మండల వ్యాప్తంగా సుమారుగా 22,700 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అంచనా. ఎస్సారెస్పీ ఆయకట్టులో పెన్‌పహాడ్ మండలం చివరిది. ఈ సీజన్‌లో నీరందక సుమారు ఎనిమిది వేల ఎకరాలకు పైగా వరి పంట ఎండిపోయింది. బోర్‌మోటర్లు, బావులను ఆధారంగా చేసుకుని వరి పంటను సేద్యం చేస్తున్నారు. వేసిన కొద్దిపాటి పంటలు కూడా తెగుళ్ల బారిన పడ్డాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల విషయమై వ్యవసాయాధికారులకు తెలిపిన పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు.



బోర్‌మోటార్లు, బావి ఉన్నా ప్రయోజనం లేదు



మూడు బోర్ మోటర్లు, ఒక బావి ఉందనే ఆశతో 10 ఎకరాల్లో వరి సాగు చేశా. భూగర్భ జలాలు అడుగంటి పొట్టదశలోని రెండు ఎకరాల వరి పంట పూర్తిగా ఎండింది. బోర్ మోటర్ల నుంచి వస్తున్న కొద్దిపాటి నీటితో పంటకు వరస తడులు పెడుతున్నాం. ఎండిపోయిన పంటను అధికారులు పరిగణలోకి తీసుకోవాలి. పంటకు పెట్టిన పెట్టుబడి వచ్చే అవకాశం లేదు.

● బొలిశెట్టి భిక్షమయ్య, నాగులపాటి అన్నారం, పెన్‌పహాడ్

ఎండిన పంటలను నమోదు చేయం

ఎండిపోయిన పంటల వివరాలను నమోదు చేయలేం. ఉన్నతాధికారుల నుంచి నమోదు చేయాలన్న ఆదేశాలు లేవు. వారి ఆదేశాల లేకుండా ఎలా నమోద చేస్తాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే సర్వే చేసి ఎండిన పంటల వివరాలు సేకరిస్తాం. ఏఈవోలు రైతువేదికల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటా. రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్నాం.

● కృష్ణ సందీప్, ఏవో

ఆర్య సమాజం.. శతవసంతం

నల్లగొండ /నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 29 : నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆర్య సమాజం ఏర్పాటై వందేళ్లు అయ్యింది. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నారు. 1875 ఏప్రిల్ 10న మహారాష్ట్ర రాజధాని ముంబాయిలో మహర్షి దయానంద సరస్వతి ఆర్య సమాజాన్ని స్థాపించారు. హిందూ ధర్మాన్ని అన్ని మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, వేదాలకు దగ్గరగా తీసుకెళ్లడమే ఆర్యసమాజం ముఖ్య ఉద్దేశ్యం. ఇది ఏర్పడిన 50 ఏళ్లకు 1924లో నల్లగొండ జిల్లా కేంద్రంలోని షేర్‌బంగ్లాలో ఆర్య సమాజాన్ని ప్రారంభించారు. కొమర్రాజు కోటేశ్వరరావు నల్లగొండలో ఆర్య సమాజాన్ని నడిపించడంలో గొప్పపాత్ర పోషించారు. నల్లగొండకు చెందిన బలిజ బొంతయ్యను హరిద్వార్ పంపి సంస్కృతం, వేదాలు నేర్పించి పండిత భద్రదేవ్‌గా నల్లగొండలో ఆర్య సమాజ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. ఆర్య సమాజం ఆధ్వర్యంలో గ్రంథాలయం స్థాపించి పుస్తక పఠనానికి అవకాశం కల్పించారు. ఆడపిల్లలకు స్కూల్ నడిపించేవారు. చదువుతో పాటు కర్రసాము, కత్తిసాము కూడా నేర్పేవారు. పండిత భద్రదేవ్, మాత వేదవతిలు కలిసి అనేక కార్యక్రమాలు చేశారు. 1938లో ఆల్ ఇండియా ఆర్య సమాజ్ సమావేశం నల్లగొండలో పెద్దఎత్తున నిర్వహించారు. 1965లో బాలికల పాఠశాల కోసం చందాలు పోగు చేసి గదులు నిర్మించారు. మొదట నిర్మించిన భవనాన్ని గవర్నమెంట్ బాలుర ఉన్నత పాఠశాల కోసం ఇచ్చారు. తరువాత నిర్మించిన భవనాన్ని గవర్నమెంట్ బాలికల ఉన్నత పాఠశాలకు ఇచ్చారు. నల్లగొండ పట్టణానానికి చెందిన దోమలపల్లి యాదగిరిరావు ఆర్యసమాజ భవనం కోసం ఆర్యసమాజం ఆధ్వర్యంలో పేదలకు విద్యనందించేందుకు భూమి కొనుగోలు చేసి భూదానం చేశారు. అదే భూమిలో నల్లగొండకు మేధావులను అందించిన రామగిరి బాలుర, బాలికల పాఠశాలలను ఏర్పాటుచేశారు. వెంకటనారాయణ ప్రెసిడెంట్‌గా ఉండగా రామగిరిలో ఆర్యసమాజం మందిరం నిర్మితమైంది. శ్రీ విశ్వామిత్ర, మాతల ఆధ్వర్యంలో పెళ్లిళ్లు, ఉపనయనాలు, సమావేశాలు, సత్సంగాల నిర్వహణ ప్రారంభమైంది. ఆ తర్వాత బీద పిల్లలకు 5వ తరగతి దాకా పాఠశాల, కరాటే, వారం వారం యజ్ఞం, సమావేశాలు నిర్వహించారు. నల్లగొండలో జరిగిన నిజాం విముక్తి పోరాటంలో ఆర్య సమాజ్ ముందు వరుసలో నిలిచింది. జిల్లాలోని ప్రముఖ కమ్యూనిస్టు యోధులైన ధర్మభిక్షం కూడా ఆర్యసమాజం బాధ్యులుగా ఉన్నారు. నల్లగొండలో ప్రతీ దసరాకు షేర్ బంగ్లా ఆర్య సమాజం నుంచి రామగిరి ఆర్యసమాజం మందిరం దాకా ఒక నగర ప్రముఖుడిని గుర్రంపై ఆశీనులు చేయించి శోభాయాత్ర నిర్వహిస్తారు.అదొక గొప్ప వేడుకగా నిలిచింది.

నేటి నుంచి శతజయంతి ఉత్సవాలు

నల్లగొండ ఆర్యసమాజ్ స్థాపించి వందేళ్లయిన సందర్భంగా శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మార్చి 1, 2, 3 తేదీల్లో మూడు రోజుల పాటు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా స్వామి రాందేవ్‌బాబా హాజరుకానున్నారు. ఇదే సందర్భాన్ని పురస్కరించుకుని ఆర్య సమాజం వ్యవస్థాపకుడు మహర్షి దయానంద సరస్వతి ద్విశత జన్మ జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. మహాసభల ప్రారంభం రోజున 200 కుండాలలో జరుపతలపెట్టిన చరిత్రాత్మకమైన మహాయజ్ఞంలో స్వామి ప్రణావానంద సరస్వతి పాల్గొననున్నారు.



జయంతి ఉత్సవాలకు ఏర్పాటు చేసిన వేదిక

భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చేలా కార్యక్రమాలు

ఏ విలువల కోసమైతే ఆర్యసమాజం ఏర్పడిందో దాన్ని కొనసాగిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నాం. ఆర్యసమాజం ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మహర్షి 200 జయంతి సందర్భంగా 200 కుండాలలో మహాయజ్ఞం నిర్వహిస్తున్నాం. భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చేలా ఈ కార్యక్రమాలుంటాయి. నల్లగొండలో మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలి.

● బోయపల్లి కృష్ణారెడ్డి, ఆర్యసమాజం అధ్యక్షుడు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి


చందు(ఫైల్‌ఫొటో)

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 29 : ఇసుక ట్రాక్టర్ పల్టీకొట్టి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో గురువారం జరిగింది. ఎస్ నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన గట్టు చందు(25) ఇసుక ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం కామునిగూడెం బిక్కేరు వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను మండల కేంద్రంలో దించాడు. ఖాళీ ట్రాక్టర్‌తో వాగులోకి వెళ్తున్న క్రమంలో బూనాదిగాని కాల్వ గట్టు మీద ట్రాక్టర్‌ను అతివేగంగా నడపడంతో అదుపుతప్పి కాల్వలోకి పల్టీకొట్టింది. చందుపైన ట్రాక్టర్ ఇంజన్ పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చందుకు భార్య కావ్య, రెండేళ్ల కుమార్తె సహస్ర ఉన్నారు. భార్య కావ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని...

హాలియా: నల్లగొండ జిల్లా హాలియా మండలంలో కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిడమనూరు మండలం ఉట్కూరు గ్రామానికి చెందిన నర్సింగ్ శేఖర్(36), నర్సింగ్ రాములు శేరిలింగోటం వద్ద శుభకార్యానికి వెళ్లి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నారు. అర్ధరాత్రి నల్లగొండ నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో నర్సింగ్ శేఖర్ అక్కడికక్కడే మృతి చెందారు. రాములుకు తీవ్రగాయాలయ్యాయి. రాములు ప్రస్తుతం మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శేఖర్ సోదరుడు పాపయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సు ఢీకొని...

బీబీనగర్: యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం ముగ్దుంపల్లి గ్రామసమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల శివప్రసాద్(22) చిన్నరావులపల్లిలోని హిందుస్థాన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని స్వగ్రామం గొల్లగూడెం వస్తుండగా ముగ్దుంపల్లి గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద భువనగిరి నుంచి శివారెడ్డిగూడెం గ్రామానికి వెళ్తున్న యాదగిరిగుట్ట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు.

ఆటో బోల్తా, ముగ్గురికి గాయాలు

కోదాడ రూరల్ : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో కూలీలు ప్రయాణిస్తున్న ఆటో పల్టీకొట్టిన ఘటనలో ముగ్గురు మహిళలు గాయపడ్డారు. చిమిర్యాల నుంచి మిరప పంట ఏరేందుకు కూలీ కోసం ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి ఆటోలో వెళ్తున్నారు. చిమిర్యాల క్రాస్‌రోడ్డు వద్ద సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో ప్రయాణిస్తున్న షేక్ లాల్‌బీ, మస్తానమ్మ, అచ్చమ్మ తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆటోలోని మరో ఏడుగురికి స్వల్పగాయాలయ్యాయి.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు


విజయరాఘవాపురంలో అంతిమయాత్ర

మునగాల, ఫిబ్రవరి 29 : సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలో బుధవారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కూలీలకు గురువారం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తయ్యాయి. మండలంలోని విజయరాఘవాపురం గ్రామానికి చెందిన నలుగురు కూలీలు మృతి చెందడంతో కాలనీ మొత్తం కన్నీటి పర్యంతమైంది. కందుల నాగమ్మ, గురువయ్య దంపతులు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఒకేసారి ఇద్దరికి కుమారుడు తలకొరివి పెట్టటంతో ప్రతి ఒక్కరూ కంటతడిపెట్టారు. కాలనీలో అందరితో కలివిడిగా ఉంటూ కూలీనాలీ చేసుకుని జీవించే వారు మృత్యువాతపడటం అందరినీ కలిచివేసింది. బుధవారం అర్ధరాత్రి చెవుల నారాయణమ్మను, రెమిడాల సౌభాగ్యమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. పేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

సులభంగా డబ్బు సంపాదించాలని చోరీలు


అంతర్రాష్ట్ర దొంగల అరెస్టుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 29 : సులభంగా డబ్బులు సంపాదించేందుకు పార్కింగ్ చేసిన వాహనాల అద్దాలు పగులగొట్టి చోరీకి పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి కారుతో పాటు రూ.2.77 లక్షల నగదు, కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా బోగోల్ మండలం కప్రాలపల్లి గ్రామానికి చెందిన పిట్ల మహేష్ వృత్తిరీత్యా కేబుల్ ఆపరేటర్, అదే గ్రామానికి చెందిన ఆవుల రాజేష్ మేస్త్రీగా పనిచేసేవాడు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు వారిద్దరూ కలిసి దొంగతనాలను ఎంచుకున్నారు. ఇందుకోసం పార్కింగ్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకున్నారు. ప్రత్యేక పరికరాలతో ఏమాత్రం అనుమానం రాకుండా వాహనం అద్దాలను తొలగించి అందులో ఉన్న నగదు, ఇతర వస్తువులను దొంగిలించేవారు. ఈ క్రమంలోనే నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చిన్నగుడెం గ్రామానికి చెందిన రావుల శంకర్ ఈ ఏడాది జనవరి నెల 30న టాటా ఏస్ వాహనంలో తన గొర్రెలను మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం మార్కెట్‌లో విక్రయించి వచ్చిన డబ్బులను వాహనంలోని డిక్కీలో ఉంచి హోటల్‌కు వెళ్లాడు. తిరిగివచ్చి చూసే సరికి వాహనం గ్లాస్ పగలగొట్టి ఉంది. దీనితో పాటు అందులో దాచిన నగదు రూ.97వేలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా గురువారం తెల్లవారుజామున కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి(167)పై మిర్యాలగూడ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఎర్టీగా కారులో ప్రయాణిస్తూ అద్దాలను పగలగొట్టేందుకు ఉపయోగించే పరికరాలతో అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి విచారణ చేయగా, గత నేరాలను ఒప్పుకున్నారు. వీరిపై గతంలో మిర్యాలగూడ వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదుకాగా వారి నుంచి రూ.2.77 లక్షల నగదు, కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఈ ముఠాలో వీరితో పాటు మరికొందరు కూడా ఉన్నట్లు అనుమానిస్తున్నామని, వీరిపై రాష్ట్రంలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో కూడా కేసులు నమోదై ఉండే అవకాశం ఉన్నందున రిమాండ్ అనంతరం నిందితులిద్దరిని కస్టడీకి తీసుకుని విచారించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ సతీష్, పీసీలు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనావాస్, కే సైదులు పాల్గొన్నారు.

ఎన్‌జీఎస్ కంపెనీ ఏర్పాటుకు ప్రజల మద్దతు



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

మఠంపల్లి, ఫిబ్రవరి 29 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని సుల్తాన్‌పురతండాలో ఏర్పాటుచేయనున్న ఎన్‌జీఎస్ వైట్‌పరిశ్రమ ఏర్పాటుకు ప్రజామోదం లభించింది. గురువారం జిల్లా కలెక్టర్ వెంకటరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు, వక్తలు సంపూర్ణ మద్దతు తెలిపారు. తమిళనాడు చెందిన పరిశ్రమ యాజమాన్యం ఎన్‌జీఎస్ వైట్ సిమెంట్ మిక్సింగ్ ప్లాంటు రోజుకు 200 టన్నుల ఉత్పత్తి చేస్తుందని, ముడి సరుకులు, కంకర్‌ను అరబ్, మలేషియా, దుబాయి ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్నట్లు ప్రకటించారు. దేశంలో రాజస్థాన్‌లో ఎక్కువ వైట్‌పరిశ్రమలు ఉంటాయని, సున్నపురాయిని మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెం, గుండ్లపల్లి ప్రాంతాల నుంచి తీసుకుంటున్నట్లు కంపెనీ యజమాన్యం ప్రకటించింది. పూర్తి కాలుష్య రహితంగా పరిశ్రమ ఉంటుందని వెల్లడించారు. అనంతరం మాట్లాడిన ప్రజాప్రతినిధులు, వక్తలు, ప్రజలు పరిశ్రమ నిర్మాణానికి స్వాగతిస్తున్నామని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మొక్కలు పెంచాలని సూచించారు. ప్రజాభిప్రాయ సందర్భంగా యాజమాన్యం ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. మొత్తం 46మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. నలుగురు మినహా మిగతా వారందరూ పరిశ్రమ ఏర్పాటుకు మద్దతు తెలిపారు. పర్యావరణ నిబంధనలు పాటించి, హామీలను తప్పనిసరిగా అమలు చేస్తామని కంపెనీ యాజమాన్యం ప్రకటించింది. పరిశ్రమ నిర్మాణ ప్రారంభంలో 25మంది కంపెనీ ఉద్యోగులుతో పాటు మరో 50మంది కాంట్రాక్ట్ కార్మికులకు అవకాశాలు ఉంటాయని, పూర్తయిన తరువాత 40మంది కంపెనీ ఉద్యోగులు, 50మంది కాంట్రాక్ట్ ఉద్యోగ అవకాశాలతో పాటు పరోక్షంగా వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తుందని తెలిపారు.

540 సర్వే నెంబరుపై గ్రామసభ ఏర్పాటు చేస్తా: కలెక్టర్ వెంకటరావు

మండలంలోని పెదవీడు రెవెన్యూలోని సర్వే నెంబరు 540లో నెలకొన్న వివాదాల పరిష్కారానికి త్వరలో గ్రామసభ ఏర్పాటు చేసి వాస్తవ, అవాస్తవాలపై విచారణ చేసి సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ వెంకటరావు అన్నారు. ప్రభుత్వ నూతనంగా తీసుకువస్తున్న మాభూమి పథకం ద్వారా సర్వే నెంబరుపై ప్రత్యేక దృష్టి సారించి, నిరుపేద అర్హులైన రైతులకు న్యాయం చేస్తామన్నారు. కంపెనీ ఏర్పాటుపై అభిప్రాయసేకరణలో 46 మంది ప్రత్యక్షంగా అభిప్రాయాలను తెలిపారని, 75 మంది రాతపూర్వకంగా, మరో ఆరుగురు ఈ మెయిల్ ద్వారా అభిప్రాయాలను వ్యక్త చేశారని కలెక్టర్ తెలిపారు. చిన్న చిన్న పరిశ్రమల ఏర్పాటుకు స్వాగతిస్తున్న ఈ ప్రాంత ప్రజలు అభివృద్ధి కాముకులని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో పర్యావరణ శాఖ ఉమ్మడి జిల్లా ఈఈ సురేష్‌బాబు, అదనపు ఎస్పీ నాగేశ్వరావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐలు చరమందరాజు, రామకృష్ణారెడ్డి, వైట్ పరిశ్రమ ఎండీ నారాయణన్, నాయకులు సాముల శివారెడ్డి, జడ్పీటీసీ జగన్‌నాయక్, భూక్యమంజూనాయక్, తహసీల్దార్ మంగారాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : జైవీర్‌రెడ్డి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 29: అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించి గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తూర్పుబజార్ నుంచి మెయిన్ సెంటర్ వరకు గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి సీసీరోడ్డు పనులను ప్రారంభించిన మాట్లాడారు. మండలకేంద్రంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామ అభివృద్ధికి నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు శాగం పెద్దిరెడ్డి, గడ్డం సాగర్‌రెడ్డి, చవ్వా బ్రహ్మానందరెడ్డి, శాగం రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, నాయకులు శాగం శ్రవణ్ కుమార్‌రెడ్డి, పిట్టల కృష్ణ, రహీం, రాంరెడ్డి, లింగారెడ్డి, కృష్ణ, నాగిరెడ్డి, సైదిరెడ్డి, కళమ్మ, సాలయ్య, ఎల్లయ్య, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

చెర్వుగట్టు జాతర హుండీ ఆదాయం రూ.18.63 లక్షలు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం హుండీల కానుకలను లెక్కించారు. జాతర సందర్భంగా మొత్తం 16 రోజులకు కలిపి హుండీల కానుకలను లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదు రూ.18,63,680లు లభించినట్లు ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. గుట్టపైన ప్రధానాలయం, ఇతర ఉపాలయాల వద్ద ఉన్న హుండీలను తెరిచి లెక్కించగా 14,71,520, గుట్ట కింద పార్వతీ అమ్మవారి ఆలయం వద్ద ఉన్న హుండీలను లెక్కించగా రూ.3,92,160 లభించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సహాయ కమిషనర్ మహేంద్రకుమార్, డివిజన్ పరిశీలకురాలు వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి



రామాలయ భూమి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 29: ప్రజలు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో గురువారం నూతనంగా నిర్మించనున్న అయోధ్య రామాలయ నిర్మాణ భూమి పూజ, గోగువారిగూడెంలో నిర్మించిన కనక దుర్గ అమ్మవారు, ముత్యాలమ్మ అమ్మవార్ల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత అలవడుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయ సింహారెడ్డి, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, నాయకులు చౌగాని భిక్షంగౌడ్, బారెడ్డి అశోక్‌రెడ్డి, బండ్ల మట్టయ్య, ఏడుకొండలు, నాగమణిఅశోక్‌రెడ్డి, రవీందర్‌నాయక్, వెంకటేశ్వర్లు, సైదాచారి, శేఖర్, వీరయ్య పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

దేవరకొండ, ఫిబ్రవరి 29: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి అన్నారు. దేవరకొండలో గురువారం నిర్వహించిన ఏఐటీయూసీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. 60 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు రూ.6 వేల పింఛన్ అందజేయాలని, కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులను సలహా బోర్డులో నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ డివిజన్ కోశాధికారి జూలూరి వెంకట్రాములు, నాయకులు మల్లయ్య, సైదులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాచారంలో మైనింగ్ తవ్వకాలు చేపట్టవద్దు

దేవరకొండ, ఫిబ్రవరి 29: దేవరకొండ మండలం కాచారం గుట్టల్లో మైనింగ్ తవ్వకాలను చేపట్టవద్దని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ప్రైవేట్ సంస్థ మైనింగ్ తవ్వకాలను చేపట్టేందుకు అనుమతి పొందడంతో కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చినట్లు కాచారం గ్రామానికి చెందిన న్యాయవాది నిరసనమెట్ల సుందరయ్య గురువారం తెలిపారు. సర్వేనెంబర్ 13లోని 24.7 హెక్టార్ల ప్రభుత్వ భూమిలో మైనింగ్ తవ్వకాల కోసం నవభారత్ క్వారీ మైనింగ్ కంపెనీ దరఖాస్తు చేసుకొని అధికారుల అనుమతి తీసుకుంది. గతంలో కాచారం గుట్టల్లో మైనింగ్ తవ్వకాలు నిర్వహించవద్దని ప్రజాభిప్రాయ సేకరణలో పర్యావరణవేత్తలు, గ్రామస్థులు, స్వచ్ఛంద సంస్థలు, మానవహక్కుల నాయకులు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. తవ్వకాలకు అనుమతి ఇస్తే రైతులు, గ్రామస్థులకు ఇబ్బంది కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి నష్టం జరుగుతుందని, అనుమతులు ఇవ్వవద్దని ఆందోళనలను చేపట్టారు. కాగా అధికారులు మైనింగ్‌కు అనుమతి ఇవ్వడంతో తవ్వకాలను జరపనివ్వమని కాచారం గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి మైనింగ్ అనుమతిని రద్దు చేయాలని కోర్టును ఆశ్రయించినట్లు న్యాయవాది సుందరయ్యతో పాటు గ్రామస్థులు తెలిపారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 29: ప్రజా పంపిణీ వ్యవస్థ కింద ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న నిత్యావసర వస్తువుల పంపిణీ కోసం రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు ఆదేశించారు. తన కార్యాలయంలో గురువారం మండలంలోని రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకపై ప్రతీ నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మాత్రమే నిత్యావసరాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రతీ రేషన్ కార్డుదారుడు ఈకేవైసీ చేయించుకునేలా డీలర్లు చెప్పాలని సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ విజయారెడ్డి, ఆర్ఐ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 29: పేద విద్యార్థులకు ప్రోత్సహిస్తున్నట్లు ఎంవీఎన్ ట్రస్ట్ కన్వీనర్ అక్కెపల్లి మీనయ్య తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంవీన్ విజ్ఞాన కేంద్రం వారి సహకారంతో ఎకనామిక్స్ ఫోరం ఆధ్వర్యంలో గురుకుల డిగ్రీ అధ్యాపక ఉద్యోగార్థులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారిలో 14మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. వారికి ఎంవీఎన్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



కట్టకొమ్ముతండాలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఫిబ్రవరి 29: ఎస్ఎల్‌బీసీ, డిండి, నక్కలగండి ప్రాజెక్టులను పూర్తిచేసి దేవరకొండ నియోజకవర్గానికి సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ మండలం కట్టకొమ్ముతండాలో గురువారం సీసీ రోడ్డు పనులు, ముదిగొండలో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహాయ, సహకారాలతో దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో దేవరకొండ ఎంపీపీ జాన్‌యాదవ్, మాజీ ఎంపీపీ పల్లా నర్సింహారెడ్డి, ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, ఎంపీవో నీలిమా, పీఆర్ఏఈ శంకర్, మాజీ సర్పంచ్ శివయ్య, హరికృష్ణ, రాంసింగ్, రాందాస్, పాండునాయక్, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. దేవరకొండ మండలం పడ్మట్‌పల్లి జడ్పీ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ రెండోరోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులతో తయారు చేయబడిన వివిధ పరికరాలను ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులంతా పాఠశాల దశ నుంచే సృజనాత్మకతను అలవరుచుకోవాలన్నారు. అనంతరం పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మనం, మనబడి ఫౌండేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మనం, మనబడి ఫౌండేషన్ విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దేవరకొండ ఎంపీపీ జాన్‌యాదవ్, మాజీ ఎంపీపీ పల్లా నర్సింహారెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, మనం, మనబడి ఫౌండేషన్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో

కష్టపడి చదవాలి : డీఎస్పీ

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 29: విద్యార్థులు పరీక్షల ఒత్తిడికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో కష్టపడి చదివి ఉత్తమఫలితాలు పొందాలని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ విద్యార్థులకు గురువారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి భవిష్యత్తులో పదో తరగతి ఉత్తీర్ణత ప్రముఖపాత్ర పోషిస్తుందన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదువుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ప్రధానంగా టీనేజీ వయస్సులో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఈ దశలో తమ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని కోరారు. అనంతరం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని బలపరిచేందుకు టాలెంట్ టెస్ట్ నిర్వహించిన ఏఐఎస్‌బీ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ పర్యవేక్షకులు ఎల్‌ఎన్‌రెడ్డి, ఏఐఎస్‌బీ రాష్ట్ర సహాయకార్యదర్శి ఎద్దు ప్రవీన్, వినయ్, మురళి, పద్మ, మురళి, రామాచారి, మధుసూదన్, సురేష్, చైతన్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు

మర్రిగూడ, ఫిబ్రవరి 29: ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మర్రిగూడ ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేయడంతో 391 మంది విద్యార్థులకు గాను 348మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 42 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శివసర్వాపరాణి తెలిపారు. అంతకుముందు పరీక్ష కేంద్రంలో పరీక్ష రాస్తున్న సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ నిర్వహించి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేశారు.

చింతపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 192మందికి గాను ముగ్గురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండ్ నోముల రామస్వామి తెలిపారు.

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల కళాశాలలో 308 మంది విద్యార్థులకు 294 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రమణకుమారి తెలిపారు. శ్రీక్రాంతి జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 201 మంది విద్యార్థులకు 200 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వాసిరం తెలిపారు.

వాహనాల పార్కింగ్‌పై స్పెషల్ డ్రైవ్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 29: పట్టణంలోని దేవరకొండ రోడ్డులో ఇష్టానుసారంగా నిలిపిన ఇసుక ట్రాక్టర్లపై గురువారం ట్రాఫిక్ సీఐ డానియల్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అందులో భాగంగా రోడ్లపై నిలిపిన 16 ఇసుక ట్రాక్టర్లు, 15 వాహనాలకు రాంగ్ పార్కింగ్, డాక్యుమెంట్లు సరిగా లేని కారణంగా ఒక్కొక్క బండికి రూ.1100 చొప్పున 15 వాహనాలకు రూ. 16500 జరిమానా విధించారు. అదేవిధంగా ఒక ట్రాక్టర్‌కి మైనింగ్ పర్మిషన్ లేకపోవడంతో పట్టణ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ డానియల్‌కుమార్ ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. వాహనాలను రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణమూర్తి, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి ప్రధాని నరేంద్రమోదీనే : బీజేపీ



హాలియాలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

హాలియా, మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 29: దేశంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చి ప్రధాని మోదీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని బీజేపీ విజయ సంకల్పయాత్ర ప్రముఖ్ శ్రీవర్ధన్‌రెడ్డి, మాజీఎమ్మెల్సీ రాంచందర్‌రావు అన్నారు. హాలియా, మిర్యాలగూడలో గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్రప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు పరిచిన సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకూ మేలు చేసినట్లు చేశాయన్నారు. దేశానికి ప్రపంచంలోనే గుర్తింపు తెచ్చిన మోదీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 21 నియోజకవర్గాల్లో 11 రోజుల పాటు బీజేపీ విజయ సంకల్ప యాత్ర కొనసాగుతుందన్నారు. కశ్మీర్‌లో 370ఆర్టికల్ రద్దు చేయడంతో దేశంలో ఉగ్రవాదం తగ్గిపోయిందన్నారు. ముస్లిం తలాక్ బిల్లును రద్దు చేసిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అయోధ్యలో రామ మందిర నిర్మాణం బీజేపీతోనే సాధ్యమైందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుపరచడంలో రేవంత్‌రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు జితేంద్ర గుప్తా, కొంపెల్లి శ్రీనివాస్, మన్నెం రంజిత్‌యాదవ్, చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి, చలమల వెంకట్‌రెడ్డి, మన్మథరెడ్డి, పానుగోతు రవినాయక్, ఉయ్యాల నర్సింహగౌడ్, నూకల నర్సింహారెడ్డి, సాధినేని శ్రీనివాసరావు, బాణావత్ రతన్‌సింగ్‌నాయక్, జితేందర్‌కుమార్, సాంబయ్య, బంటు సైదులు, పురుషోత్తంరెడ్డి, ఎడ్ల రమేష్, సరిత, జానాబాయి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య



స్రవంతి (ఫైల్ ఫొటో)

చింతపల్లి, ఫిబ్రవరి 29: కడుపునొప్పి భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన చింతపల్లి మండలంలోని కుర్మేడు గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. చింతపల్లి ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం... కుర్మేడు గ్రామానికి చెందిన కల్వకొల్లు అనిల్‌రెడ్డి స్రవంతి దంపతులు. అనిల్‌రెడ్డి కుర్మేడు ఎక్స్‌రోడ్డుపై మెడికల్ షాపు నిర్వహిస్తుండగా స్రవంతి (28) మండలంలోని వీటీనగర్‌లో గల ఓ ప్రైవేట్ ఆసుపత్రి లో పనిచేస్తుంది. కొన్ని రోజులుగా స్రవంతికి కడుపునొప్పి రావడంతో ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఆరోగ్యం బాగుకాలేదు. బుధవారం యథావిధిగా అనిల్‌రెడ్డి మెడికల్ షాపునకు వెళ్లగా స్రవంతి వీటీనగర్‌లోని ఆస్పత్రి డ్యూటీ నిమిత్తం వెళ్లింది. బుధవారం రాత్రి స్రవంతి ఇంటికి చేరుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త అనిల్‌రెడ్డి ఇంటికి వచ్చి చూసే వరకు స్రవంతిని చూసి లబోదిబోమన్నాడు. స్థానికుల సహాయంతో వీటీనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త అనిల్‌రెడ్డి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం మృతురాలి తల్లి సూర్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదయ్య తెలిపారు.

బంజారా భవనానికి స్థలం ఇప్పించేందుకు కృషి

● మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



సభలో ప్రసంగిస్తున్న మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 29: జిల్లా కేంద్రంలో బంజారా భవనానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో మాట్లాడి స్థలం ఇప్పించేందుకు తన వంతుగా కృషి చేస్తానని నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన సంతుసేవాలాల్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ కేవలం గిరిజనుల ఆరాధ్యదైవం మాత్రమే కాదని, అందరికీ ఆరాధ్యుడేనని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నేటి యువత పయనించాలని అన్నారు. ఏఎస్పీ రాములునాయక్ మాట్లాడుతూ బంజారాజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ మన సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలని సూచించారు. మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజల అభివృద్ధికి, సంస్కృతీసంప్రదాయాలకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్, నాయకులు అంగోత్ భగవాన్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ ప్రవీణ్‌నాయక్, ఆర్.శంకర్‌నాయక్, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ సింగ్, కార్యదర్శి రవినాయక్, కౌన్సిలర్ ప్రదీప్‌నాయక్, నాగార్జునాయక్, నగేష్, నరసింహనాయక్, బిక్కునాయక్ పాల్గొన్నారు.

హైకోర్టు ఏజీపీగా చంద్రశేఖర్



చంద్రశేఖర్

నిడమనూరు, ఫిబ్రవరి 29: నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన న్యాయవాది గణపురం చంద్రశేఖర్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ హైకోర్టు ఆఫ్ తెలంగాణ (ఏజీపీ)గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన్ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా యూనివర్సిటీలో లా పూర్తి చేసిన ఆయన హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలు పెట్టారు. హైకోర్టులో న్యాయవాదిగా పని చేస్తూనే కోర్టుకు వచ్చే బాధితులకు అవసరమైన న్యాయ సలహాలు అందించేవాడు. తీన్మార్ మల్లన్న టీంలో కూడా లీగల్ అడ్వైజర్‌గా సేవలందించాడు. అంతేకాక మల్లన్నపై గత ప్రభుత్వం పెట్టిన కేసులపై కోర్టుల్లో బలంగా వాదనలు వినిపించారు. ఎన్నికల సమయంలో మల్లన్నతో పాటు చంద్రశేఖర్ కూడా కాంగ్రెస్‌లో చేరాడు. ప్రభుత్వం ఆయన్ను ఏజీపీగా నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కోర్టులో న్యాయం జరిగేలా చూస్తానని, తనను ఏజీపీగా నియమించేందుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కాంతయ్య

నల్లగొండరూరల్, ఫిబ్రవరి 29: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రప్రభుత్వ ప్రయత్నిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ముగ్దుం భవనంలో గురువారం నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పని జరిగే ప్రాంతంలో రెండుసార్లు ఫొటో విధానాన్ని ఉపసంహరించుకోవాలని, ఆధార్ సీడింగ్, వేతనాల ఆలస్యం తదితర సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. భారతదేశంలో 25.89 కోట్ల మందికి ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్నాయని, కేవలం 13 కోట్ల 48 లక్షల మంది మాత్రమే ఆధార్‌కు, బ్యాంకు లింకు చేసుకున్నారని తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలో 80 లక్షల 23వేల 310 మంది జాబ్‌కార్డులు ఉండగా కేవలం 18 లక్షల 435 మందికి మాత్రమే బ్యాంకు అనుసంధానం చేయించుకున్నారని అన్నారు. మిగిలిన వారు కేవైసీ కాక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆధార్ లింక్ లేకుండా కూలీలు అందించాలని లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. లొడంగి శ్రావణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు చెడుబుద్ధి ఉష, వేముల బుచ్చయ్య, కార్యవర్గ సభ్యులు కాగిత వెంకన్న, శంకర్‌నాయక్, ఇరిగి సంజీవ, వెంపటి శ్రీనివాస్, అమరసింగ్, ఎస్.సైదులు, బి.సైదులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

● పాఠశాల ఎదుట ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆందోళన

నకిరేకల్, ఫిబ్రవరి 29: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్న శ్రీ చైతన్య యాజమాన్యంపై వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ డిమాండ్ చేశారు. అధిక ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్న నకిరేకల్‌లోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ గురువారం స్కూల్ ఆవరణలో విద్యార్థి సంఘం నాయకులు పెట్రోల్ బాటిల్‌తో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులుయాదవ్ మాట్లాడుతూ ఫీజులు సకాలంలో చెల్లించలేదన్న నెపం తో ఒక విద్యార్థినిని తరగతి ఎదుట ఎండలో నిలబెట్టడం సరైంది కాదన్నారు. స్కూల్‌లో కనీస వసతులు కల్పించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తూ ఫీజుల కోసం విద్యార్థులను, వారి తల్లిదండ్రులను వేధిస్తున్నారని ఆరోపించారు. సూల్ యాజమాన్యం వేధింపులు వెంట నే ఆపాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీంతో స్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని సర్ది చెప్పడంతో నాయకులు ధర్నా విరమించారు. ఆందోళన కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు పొడేటి సింహాద్రి, నోముల గణేష్, పోతెపాక గౌతమ్, ఎస్‌కే నజీర్‌బాబా, బండి శ్రీను, తూముల సుధీర్, భరత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులతో పని చేయించుకోవద్దు'

చండూరు, ఫిబ్రవరి 29: చండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటెండర్ లేకపోవడంతో విద్యార్థులతో ఆయా పనులు చేయిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులతో, ప్రధాన రహదారిపైకి పంపించి టీ తెప్పించుకుంటున్నారని, ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించగా మరోసారి జరగకుండా అప్రమత్తంగా ఉంటామన్నారు.

సంక్షిప్త సమాచారం...

చిట్యాల: కథలు చదవడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని, నైతిక విలువలు పెంపొందుతాయని బాలల కథా రచయిత, ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి తెలిపారు. చిట్యాల జడ్పీ హైస్కూల్‌కు ఆయన రచించిన బంతిపూలు, బహుమతి పుస్తకాలను అందజేశారు.

అడవిదేవులపల్లి: మండలంలో గ్యాస్ లేని 22 మంది నిరుపేదలకు ఉజ్వల గ్యాస్ యోజన కింద ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కూరాకుల రవీందర్‌కుమార్ అన్నారు.

హాలియా: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదలతో సాధించాలని హాలియా జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గుండా కృష్ణమూర్తి తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్‌డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మర్రిగూడ: మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిని బయట పడకుండా కప్పిపుచ్చుకోవడానికే మాజీసీఎం కేసీఆర్ మేడిగడ్డ ప్రాజెక్టుకు వెళ్తున్నారని కాంగ్రెస్ నాయకుడు వెంకటంపేట బాలయ్య అన్నారు. ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ భారీగా అవినీతికి పాల్పడిందన్నారు.

గట్టుప్పల్: మండలంలోని వెల్మకన్నె గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మదార్ మృతి చెందాడు. ఆయన మృతదేహానికి పార్టీ మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

శాలిగౌరారం: కాంగ్రెస్‌ను నమ్మి అసెంబ్లీలో ఎన్నికల్లో ఆగమైన తెలంగాణ ప్రజలు పార్లమెంట్ ఎన్నికలో కారు గుర్తుకే ఓటు వేయాలని భావిస్తున్నారని బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మహేశ్వరం వెంకన్న అన్నారు.

నల్లగొండ: విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం చకిలం లక్ష్మీనరసింహారావు అన్నారు. కనగల్ మండలం చర్లగౌరారం ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ పాత్రల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

తిరుమలగిరి(సాగర్): మండల కేంద్రంలో నత్తనడకన సాగుతున్న కస్తూర్బాగాంధీ విద్యాలయ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి నల్లబెల్లి జగదీష్ అన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు.

పెద్దఅడిశర్లపల్లి, అడవిదేవులపల్లి: గుడిపల్లి మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్, అడవిదేవులపల్లి మండలంలోని చింతచెట్టుతండా ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీఎస్ ఫౌండేషన్ చైర్మన్ గోలి గిరి, హెచ్‌ఎం కె.రామ్మూర్తి బహుమతులు అందజేశారు.

కనగల్: ప్రెస్‌అకాడమీ చైర్మన్‌గా సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో టీయూడబ్ల్యూజే కనగల్ ప్రెస్‌క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మిర్యాలగూడ అర్బన్: రోడ్డుప్రమాదంలో గాయపడి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వేములపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్‌ను మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

మర్రిగూడ: నాంపల్లి మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో శ్రీకంఠమహేశ్వరస్వామి దేవాలయ నిర్మాణం వైస్ ఎంపీపీ పానగంటి వెంకన్న రజనీగౌడ్ దంపతులు రూ.2.50లక్షల విరాళం అందజేశారు.

నల్లగొండరూరల్: జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశాన్ని 3వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి జడ్పీ హైస్కూల్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్ విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు తెరవడం, ఆన్‌లైన్ లావాదేవీలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొండమల్లేపల్లి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఆర్.సంతోష్, సీఎస్పీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్: ప్రైవేట్ ఆస్పత్రికి చెందిన యాజమాన్యం ఓ అడ్వకేట్‌తో ఫోన్ చేయించి బెదిరించడాన్ని నిరసిస్తూ ఎంసీపీఐ(యూ) నాయకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సంఘటన మిర్యాలగూడలోని డాక్టర్స్ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. బాధిత నాయకుడు వస్కుల మట్టయ్య తెలిపిన వివరాల ప్రకారం... తనకు పరిచయం ఉన్న రోగికి సరైన వైద్యం అందించలేదని ఆస్పత్రిపై వైద్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడితో కలిసి వెళ్లిన తనకు ఆస్పత్రి నిర్వాహకుడు రవీందర్‌రెడ్డి తమ అడ్వకేట్ డీవీరావుతో ఫోన్ చేయించి బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపించాడు. బెదిరింపులకు పాల్పడిన ఆస్పత్రి యాజమాన్యం, అడ్వకేట్ నుంచి తనకు ప్రాణభయం ఉందని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

శీత్లతండా వాసికి హ్యాట్రిక్ ఉద్యోగాలు

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 29: మండలంలోని శీత్లతండా గ్రామపంచాయతీకి చెందిన ఇస్లావత్ కపుర పెద్ద కుమారుడు ఇస్లావత్ హనుమ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో గురువారం గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. జాయింట్ సీఎస్ఐఆర్ యూజీసీ నిర్వహించిన జాతీయ స్థాయి పరీక్షలో హనుమ జేఆర్ఎఫ్ (జూనియర్ రీసెర్చ్ ఫెలో), ఎన్ఈటీ (నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్), టీఎస్ఎస్ఈటీ (స్టేట్ ఎలిజిబిలిటి టెస్ట్) సాధించి ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్గానిక్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో పీహెచ్‌డీ రీసెర్చ్ స్కాలర్‌గా పరిశోధన చేస్తున్నాడు. ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పీజీటీ ఫిజికల్ సైన్స్‌గా హ్యాట్రిక్ ఉద్యోగాలు సాధించాడు. హనుమ హ్యాట్రిక్ ఉద్యోగాలు సాధించడంపై గ్రామస్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.